# మినీ కథ వెంకన్నకి

"అలివేలూ... అణిముత్యమా" అని పాడుతూ క్రితం రోజులా హుషారుగా వస్తాడన్న వెంకన్న ఏడుగంటలైనా రాలేదు ఆరోజు. అలిమేలుమంగకి చిరాకేసింది. ఆరోజు బుధవారం కావటంమూలాన, అమ్మగారి ఆలయంలో రద్దీ లేదు. "వెంకన్న ఇంకా రాలేదేం చెప్మా" అంటూ అసహనంగా లేచి గుమ్మంలో నిలబడి చూసింది మంగ. వెంకన్న ఆలయంముందు తండోపతండాలుగావున్న భక్త బృందం చూసి, 'ఇప్పుడప్పుడే రాడ్లే' అనుకుని వెళ్ళి, ఫోమ్ బెడ్ మీద పడుకుంది మంగ. అలాగే ఓ కునుకు తీసింది.

"మంగా... మంగా..." అంటూ పిలుస్తున్న వెంకన్న గొంతు వినిపించింది. ఆగకుండా మోగుతున్న బజ్జర్ శబ్దంవిని, ఉలిక్కిపడి వెళ్ళి తలుపుతీసింది మంగ. విచారంగా లోపలికి వస్తున్న వెంకన్నను చూసి, "స్వామీ! ఏమిటిలా వున్నారు?..." అనడిగింది మంగ... వెంకన్న మాటా పలుకులేకుండా తిన్నగావెళ్ళి, రివాల్వింగ్ చైర్‌లో కూర్చుని దీర్ఘంగా నిట్టూర్చాడు. "మంగా..." నీరసంగా పిల్చాడు వెంకన్న. ఏమిటన్నట్లు వెళ్ళి దగ్గర నిల్చుంది మంగ. "తిరుచానూరు హుండీ వసూలు ఎంత నిల్వ వుంది?" అడిగాడు వెంకన్న, మంగని చూస్తూ. "అదేమిటండీ, తిరుచానూరులో వసూలైనమొత్తం, తిరుపతిలో బావగారి వసూలు, తిరుమల్లో మీ వసూలు మొత్తం, ఒక్క ఖాతాలోనేకదా జమ చేస్తున్నాం. అదే మన ఆంధ్రా బ్యాంకు లేక భారతీయ స్టేట్ బ్యాంక్‌లో. వేరేఖాతాలు లేవుకదా... అద్సరే...వున్నట్టుండి ఈరోజు బ్యాంక్ బాలన్స్ గురించి అడుగుతున్నారేమిటి?" అంది మంగ.

"ఈరోజు, కుబేరుడు, ఓ మెస్సెంజర్ని పంపాడే మంగా... రెండేళ్ళకి వడ్డీ, మూలధనంలోకూడా కాస్త జమచెయ్యాలని రాయబారం పంపాడు..." నీరసంగా అన్నాడు వెంకన్న.

"ఆమాత్రానికే అలా దిగాలుపడ్తారెందుకండి. మన ఖాతాలో, టి.టి.డి పేర్న యాభై కోట్లు వున్నాయిగదా, ఇచ్చేస్తేపోతుందిగాని రండి భోజనంచేసాక ఆలోచిద్దాం" అంది మంగ.

"అది రెండేళ్ళక్రితం మాటలే మంగా. ఇప్పుడు, మన ఖాతాలో అంతడబ్బుల్లేవు. రాష్ట్ర ప్రభుత్వంమన టిటిడిఖాతాలోనిడబ్బుల్ని, ప్రభుత్వ ఖజానాకి తరలించి, బొక్కసం ఖాళీచేయించింది. నీకు తెలియదా... ప్రభుత్వంమారింది. గోదావరి గట్టుకి గండిపడినట్లు మన ఖజానాకి కన్నం పడింది." ఆలోచన్లో పడ్డాడు వెంకన్న. "అంత ఇబ్బంది అయితే మీరే ప్రభుత్వాన్ని మార్చి, ఇది వరకటిలా, అంటే మన నిధులతో శ్రేయంగని ప్రభుత్వానికి పట్టం కట్టకపోయారా..." సాలోచనగా అంది మంగ.

"పిచ్చిదానా... అందరూ మన ద్వారం ముందు నిలబడి 'వెంకన్న డౌన్...డౌన్' అంటూ అరవాలనా ఈ సలహా ఇస్తున్నావు?" తీక్షణంగా చూస్తూ అడిగాడు వెంకన్న.

"అదేమిటి స్వామీ... నేనెందుకలా కోరుకుంటాను" నొచ్చుకుంది మంగ.

"లోగడ ఈ యన్టీఆర్ ప్రభుత్వాన్ని, కాంగ్రెసులు కూల్చి, భాస్కరరావుని ముఖ్యమంత్రిగా చేసినప్పుడు ప్రజలంతా ఎలాసమ్మెలు, ఉద్యమాలు చేసారు, తిరిగి యన్టీఆర్ని ముఖ్యమంత్రి చెయ్యమని. నీకు తెలియదా? అయినా, మన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముచ్చటపడి ఎన్నుకున్న నాయకుల్ని, వారి పదవీకాలం ముగియకముందే మార్చేస్తే ప్రజలు వూరుకుంటారా... ప్రజల అభీష్టంపైనేకదా ఈ నాయకులు పదవి నలంకరించారు. ఆ ప్రజలే వాళ్ళని గద్దె దించేవరకు మనం చూస్తూవుండాల్సిందే..." చెప్పాడు వెంకన్న.

"అలాగా" అంటూ నిట్టూర్చింది మంగ.

"మీరు మరోలా అనుకోనంటే నేనొక

కే. భూపతి రాజు



## నామం

సలహాచెబుతాను స్వామీ..." నెమ్మదిగా అంది మంగ.

"ఏమిటది" అడిగాడు వెంకన్న.

"మీరు సరాసరి యన్టీఆర్ దగ్గరకెళ్ళి, మన సమస్యల్ని తెలియజేసి, మన ఖాతాలోంచి తీసుకున్న డబ్బులు తిరిగి జమచేయించమని అడిగితే..."

"ఈ ప్రయత్నం నేనిదివరకే చేసాను. ఒకరోజు పుపయాన్నే, భాగ్యనగరంవెళ్ళి, ముఖ్యమంత్రిని కలిసి, మన ఖజానాలోంచి తీసుకువెళ్ళిన డబ్బులు గురించి ప్రస్తావించాను. ఆయన కనీసం ఆ డబ్బు ఎవరిదనికూడా ఆలోచించకుండా, 'బాబును కలిసారా... బాబును చూసి ఆనకరండి' అంటూ వెళ్ళిపోయారు"

"ఏమండీ... మీరొక పొరపాటు చేశారండీ" ఆలోచిస్తూ అంది మంగ. "ఏమిటది" అన్నాడు వెంకన్న.

"ఈ డబ్బంతా ఏ స్విస్ బ్యాంకులోనో దాచివుంటే మనకీ ఇబ్బంది వుండేదేకాదు గదా" అంది.

అదెలా కుదుర్తుంది? ఈ డబ్బులన్నీ స్విస్ బ్యాంకులో దాచుకోవాలంటే, నేనేమన్నా రాజకీయ నాయకుణ్ణా స్విడ్జర్లాండ్‌కు మన పుష్పకవిమానంలో వెళదామంటే ఒక్క ఫ్లైట్‌క్యూడా స్విడ్జర్లాండ్‌కిగాని, చెన్నైగ్గాని రూట్ తెలియదాయె. హైజాకర్ల గొడవ ఉండనేవుంది. తీరా మన పుష్పకవిమానంలో వెళితే స్విస్ చేరాక, అక్కడి ఎయిర్‌పోర్టు అధికారులు లాండ్ చెయ్యడానికి సిగ్నల్ ఇవ్వకుంటే నాగతేంకాను..." వివరించాడు వెంకన్న

కాలింగ్ బజర్ శబ్దంవిని వెళ్ళి తలుపు తీసింది మంగ. "ఏమ్మా వెంకన్న వున్నాడా?" అంటూ లోనికి వచ్చిన కుబేరుడ్ని చూసాడు వెంకన్న.

"ఉన్నారు రండి. అన్నయ్య, మీ గురించే అనుకుంటున్నాం" అంటూ లోనికొచ్చింది మంగ. కుబేరుడు, మంగ ఇద్దరు ఖాళీగావున్న రివాల్వింగ్ చైర్‌చూసి గతుక్కుమన్నారు. "ఇందాక, ఈ కుర్చీలోనే కూర్చున్నారు అన్నాయ్యా" అంది మంగ. "వెంకన్నా... వెంకన్నా..." అంటూ కుబేరుడు, "స్వామీ... స్వామీ..." అంటూ మంగ ఇద్దరూ, ఇల్లంతా వెతికారు. ఫలితం శూన్యం.

(ఇది కేవలం హాస్యంకోసం రాసినవ్యంగ్య రచన. ఎవరినీ నొప్పించేవుద్దేశంతో రాసింది కాదని గమనించగలరు.)

## తుమ్మెద

### మినీ కథ

"మీరింతకు తెగిస్తారనుకోలేదు. నన్ను నమ్మించి చివరికి నాగొంతు కొయ్యాలనేగా, నా బ్రతుకు నట్టేట్లో ముంచాలనిచూస్తున్నారా...ఇది మీకు తగదండీ... ఆడదాని ఉసురుపోసుకుని ఏ మగాడు సవ్యంగా జీవించలేదు."

"ఏం బెదిరిస్తున్నావా?" నిర్లక్ష్యంగాకాలర్ ఎగరేశాడు మహేష్!

"లేదు, బ్రతిమాలుతున్నాను. మీ జీవితం అరిష్టంపాలు కాకూడదని వేడుకుంటున్నాను" ధారాపాతంగా వర్షిస్తున్నాయ్ విమల కళ్ళు.

"అయ్యిందేదో అయిపోయింది. నా కోరిక తీర్చుకున్నాను. పూవు పుట్టింది నాలాంటి తుమ్మెదలకోసమే. నీ ముచ్చటాతీరింది. ఇద్దరికీ లాభమే జరిగింది, ఎవరూ నష్టపోయింది లేదు. రభస దేనికి ఇదో ఈ డబ్బు తీసుకుని అబార్షన్ చేయించుకో, గంతకుతగ్గ బొంత అన్నట్టు నీకు ఎవడో దొరక్కపోడు. పెళ్ళికిపిలిస్తే అక్షింతలు వెయ్యడానికి నాకేమీ ఇబ్బందిలేదు."

"అలా మాట్లాడకు మహేష్. నీకాళ్ళు పట్టుకుంటా. నీకు చేతులెత్తి నమస్కరిస్తా. నన్నన్యాయంచెయ్యకు. ప్లీజ్..." ఉన్నపళంగా మహేష్ కాళ్లమీదపడింది విమల

"ఛీ! ఇలాంటివి నాకు నచ్చవు. కల్లబొల్లి కబుర్లు, పగలమారి ఏడుపులు వద్దు. చెప్పొగా నీబాబు దిగొచ్చినా సరే నా నిర్ణయం మారదు. ఇంకోమాట. నీ నిలువెత్తు బంగారం పోసినా నిన్ను చేసుకోవటానికి నేను సిద్దంగాలేను. బైదిబై విమలా...నీ మ్యారేజ్ అయ్యాక...అంతగా కొత్త మొగుడు రుచించకపోతే ఈ నెంబర్‌కు ఫోన్ చెయ్. రెక్కలు కట్టుకుని వాలుతా. గుడ్‌బై."

ఇదంతా నిశ్శబ్దంగా గమనించాడు ఆ పార్కుకి వచ్చిన మఫ్టీలోవున్న ఎస్. ఐ.

చకచక నడిచివెళ్తున్న మహేష్ ముందుకు వచ్చి ఎస్. ఐ నిల్చున్నాడు. బాగా బలంగా వున్నాడు. అతని ముక్కుపుటాలు అదురుతున్నాయ్.

"బాస్టర్డ్. ఆడది అంటే అంత చులకన అనుకున్నావ్రటా. నేను అంతావిన్నాను. ఛీ! స్త్రీని ఇంతగా అవమానించిన నీకు పుట్టగతులు వుండవురా, నీకు ఇప్పుడే బుద్దొచ్చేలా చేస్తాను."

ఎస్. ఐ మహేష్‌ని ఎడా పెడా కొట్టసాగాడు. అందినచోటల్లా కుమ్ముతున్నాడు...

జరగబోయేది హింసాకాండ అని తెల్సుకుని ముందుకురికింది విమల. అప్పటికే మహేష్ నేలకరుచుకున్నాడు.



"ఎవరివయ్యా నువ్వు! మేం ఎలా తగలబడితే నీకెందుకు? అసలు నువ్వెవరివి? ఎలాబడితే అలా కొట్టడమేనా మహేష్... మహేష్...అయ్యో స్పృహతప్పినట్లున్నాడు... ఉండు నీపని చెప్తా.. పోలీస్ కంప్లయింట్ ఇచ్చి నీకు జైలు కమ్ములు లెక్కించేపని అప్పగిస్తా" విమల ఒక ప్రక్క ఏడుస్తోంది- మరో ప్రక్క ఇతన్ని దుయ్యబడుతోంది.

ఎస్. ఐ ఆశ్చర్యపోయాడు.

"అమ్మా- నువ్వెవరోగానీ- నా చెల్లిలాంటి దానివి. మీరు ఇద్దరూ ఈ పార్కులోకి వచ్చినప్పటి నుండి గమనిస్తూనేవున్నాను. ఆ రోగ్‌ని మీరు బ్రతిమిలాడటం- వాడు మిమ్మల్ని ఛీత్కరించి, విదిలించటం అంతా వింటున్నాను. వాడికి బుద్ది చెపుదామని- మరో ఆడపిల్ల వాడివలలో ఇరుక్కోకుండా కాపాడాలని- నీకు జరిగిన అన్యాయానికి నేనసలు..."

"అన్యాయమా గుమ్మడికాయా మేమిద్దరం డ్రామాయాక్టర్లం. ఇంటిదగ్గర ప్రత్యేకంగా రిహార్సల్స్ చేసుకోవటానికి కుదరక ఇలా వచ్చాం. అయ్యో మహేష్..."

ఏదైనా కేసు దొరుకుతుందేమోనని ఈ పార్కులోకి అడుగుపెట్టాను ఎస్. ఐ బుర్ర గోక్కున్నాడు.

—కోలపల్లి ఈశ్వరరావు